
# సాటకట్టు

## చంద్రం



**అయిదు గంటలకి అలారం మ్రోగింది.**

**రోజూ ఉదయం అయిదింటికి నిద్ర లేవటం అలవాటే భ్రమరాంబకి. అయితే, నిన్ననే కొత్తగా ఈ ఇంట్లో దిగటం వల్ల, సామాన్లవీ సర్దుకొని, నిద్రపోయేటప్పటికి చాలా రాత్రి అయ్యింది. అందుకనే వేళకి మెలకువ వస్తుందో లేదోనని అలారం పెట్టుకొని మరీ పడుకుంది.**

బరువుగా కళ్ళు తెరిచి, బద్ధకంగా ఒళ్ళు విరుచుకొని మంచం దిగింది భ్రమరాంబ. తన పతిదేవుడూ, పిల్లలిద్దరూ యింకా నిద్రపోతూనే వున్నారు

రెండు గదులూ చిన్న వరండా వున్న పెంకుటి పోర్షన్ అది ఆ రెండు గదుల్లో ఒకటి వంటకి, రెండోది మిగిలిన అన్నింటికీ. దొడ్లో నుయ్యి వుంది. ఆ నీళ్ళు వాడుకోవటానికేగాని, తాగటానికి పనికిరావు ఇంటికి దగ్గర్లోనే వున్న వీధి కొళాయి నుండి మంచినీళ్ళు తెచ్చుకోవాలి. అద్దె మాత్రం అరవై రూపాయలు ఇంతకుముందు వున్న యిల్లు యింతకన్న సౌకర్యంగా వుండేది కాని, ఆఫీసుకి బాగా దూరమైపోవటం వల్ల యిక్కడికి మారవలసి వచ్చింది

ఒకసారి గదంతా కలయజూసింది భ్రమరాంబ. ఇంటికి మించిన సామాను...అంతా అస్తవ్యస్తంగా వుంది. సర్దటం పూర్తికాలేదింకా అన్నీ ఒక పద్ధతిలో సర్దుకోవటానికి రెండు మూడు రోజులైనా పడుతుంది

పిల్లల ఒంటిమీది దుప్పటి సరిచేసి, పెరట్లోకి వెళ్ళింది భ్రమరాంబ నూతి పళ్ళెం మీద అంట్లు తోమే కార్యక్రమం ముగించింది వాకిలూడ్చి, కళ్ళాపి చల్లి, అందంగా ముగ్గుకూడా పెట్టింది తరవాత ఏంచేద్దామా — అని ఆలోచిస్తుండగా వీధిలోనుంచి కలకలం వినిపించింది. అది మంచినీళ్ళ కొళాయి దగ్గర ఆ ప్రాంతపు మహిళామణులు చేస్తున్న కోలాహలం

పనిమనుషిని పెట్టుకొనే తాహతు లేనందు వల్ల, బిందె పట్టుకొని మంచినీళ్లకి తనే బయల్దేరింది మధ్యతరగతి మహిళ భ్రమరాంబ

అప్పటికే దాదాపు పదిమంది క్యూలో వున్నారు. తనుకూడా వరసలో చేరింది భ్రమరాంబ

పెద్ద వీధినుండి చీలిన చిన్న వీధికి అనుబంధంగా చేరిన పిల్లవీధి అది వీధి చిన్నది కనుక ఇళ్ళు తక్కువగానే వున్నాయి. అందులోనూ కాస్త కలిగిన వాళ్ళందరికీ ఇళ్ళల్లోనే స్వంత కొళాయి లున్నాయి నూతి నీళ్ళు తాగటానికి వుపయోగపడని వాళ్ళు మాత్రమే ఈ వీధికొళాయి దగ్గర కొస్తారు కావటానికది వీధి కొళాయేగాని, మిగతాచోట్లతో పోల్చుకుంటే యిక్కడ రద్దీ తక్కువ అనే చెప్పుకోవాలి పైగా యింటికి దగ్గర కొంతవరకు మెరుగేలెమ్మనుకుంది భ్రమరాంబ

మరీ అలగా జనంలా అల్లర్లు కొట్లాటలు లేకుండా, వరసలో నిలబడి, వంతులవారీగా పట్టుకుంటే అందరికీ మంచినీళ్లు దొరుకుతాయి ప్రశాంతంగా పని జరిగిపోతుంది

వరసలో వున్నవాళ్ళు తెచ్చిన బిందె నింపుకొని వెళ్లిపోతున్నారు మళ్లీ ఖాళీ బిందె తెచ్చుకొని వరసలో నుంచుంటున్నారు

భ్రమరాంబ ముందు ఇంకా నలుగురున్నారు ఆమె వరసలో చేరిన క్షణం నుండి ఆమెను కొత్త మెంబరుగా గుర్తించి, పలకరింపులూ పరిచయాలూ చకచకా కానిచ్చేశారు — పాత మెంబర్లు.

మరొక ఆవిడ బిందె ఎత్తుకొని వెళ్లిపోయింది తరవాత ఆవిడ కొళాయి కింద ఖాళీ బిందె పెట్టింది ఇంతలోకి వెనక నుంచి

ఎవరో "దుర్గమ్మగారొస్తున్నారు ! దుర్గమ్మగారొస్తున్నారు !" అన్నారు కంగారుగా.

'ఎవరా దుర్గమ్మగారు ? ఏమా కథ ?' అని కుతూహలంగా వెనక్కితిరిగి చూసింది భ్రమరాంబ.

పొట్టిగా స్థూలంగా వున్న సుమారు నలభైఏళ్ళ నడివయస్కురాలు ఖాళీ బిందె పుచ్చుకొని గునగున నడిచి వస్తోంది గున్నఏనుగులా. కనుముక్కు తీరు గూడా ఆ ఆకారానికి తగ్గట్టుగానే వుంది.

ఆ వింత ఆకృతిని చూసి నవ్వు ఆపుకోవటం కష్టమైపోయిన భ్రమరాంబకి, వరసలో వున్న వాళ్ళందరూ పక్కకు తప్పుకొని 'రండి రండి' అని పదరు దుర్గమ్మగారికి దారి యివ్వటం, కొళాయి దగ్గర వున్న ఆవిడ సగం నిండిన బిందెని తీసేసి 'రండి పట్టుకోండి' అని పక్కకు తప్పుకోవటం, కొళాయి కింద బిందె పెట్టి, నడుం పైన చెయ్యి పెట్టి నుంచున్న దుర్గమ్మ సగర్వంగ అందరివంకా చూడటం మహాశ్చర్యాన్ని కలిగించింది

భ్రమరాంబ ఆశ్చర్యాన్నుంచి తేరుకోకముందే దుర్గమ్మ బిందె పట్టుకొని వెళ్లిపోయింది

దుర్గమ్మ అక్కడ వున్నంతసేపూ మహిళామణులెవ్వరూ పెదవి కదపలేదు.

ఆశ్చర్యాన్నుంచి తేరుకున్న భ్రమరాంబకి విషయం అంతుపట్టలేదు పక్కనున్న ఆవిడని అడిగింది. మళ్లీ దుర్గమ్మ ఖాళీ బిందె పట్టుకొని వచ్చేలోగానే కథంతా టూకీగా చెప్పేసింది పక్కావిడ

దుర్గమ్మది పుట్టిల్లు, అత్తిల్లూ ఆ వూరే. విద్యార్హత ఎలిమెంటరీ స్కూలును మించలేదు ఆమె భర్త ఏదో ప్రైవేటు ఫరంలో చిన్న ఉద్యోగం చేస్తున్నాడు ఆమె తండ్రి సుబ్బారాయుడుగారు మునిసిపల్ కౌన్సిలర్‌గా కొంత కాలం వున్నారు ఆ రోజుల్లోనే ఈ వీధి కొళాయి వెయ్యటం జరిగింది అల్లంత దూరంలో

# అభిశాపం

నేడు రక్ష స్సహస్ర సహస్ర వదనాలు
రక్తదాహం, రక్తదాహం అంటున్నవి !
అమానుష నిరంకుశ శక్తులు
అధికార దాహం, అధికార దాహం అంటున్నవి !
కర్కశ కఠోర స్వార్థాగ్నులు
కార్చిచ్చును రగిలిస్తున్నవి !
అంతస్థల విషవలయాలు
అంతస్సును ఆవరిస్తున్నవి !
జాతి ద్వేష పిశాచాలు
జడలువిప్పి నాట్యం చేస్తున్నవి !
సమాజ కబంధ హస్తాలు
సంస్కారం పీక నులిమేస్తున్నవి !
ఇది ఆధునిక భారత స్వరూపం
విధి మనకు ప్రసాదించిన అభిశాపం

— *ముసునూరు రఘువర్మ*

# ఆటకట్టు

పడవలసిన కొళాయిని, సుబ్బారాయుడుగారు గట్టిగా ప్రయత్నించి, తన అల్లుడి యింటిముందే పడేలా చేశారు. ఆ కారణంచేత ఈ కొళాయి మీద తనకేదో ప్రత్యేక అధికారం ఏర్పడినట్టు దుర్గమ్మ భావిస్తోంది మిగిలిన వాళ్ళందర్నీ భావింప జేస్తోంది

కొళాయి దగ్గర చేరిన వాళ్ళందరికీ కొన్ని నియమనిబంధన లున్నయ్...వరసలో నుంచోవటం, వంతులవారీగా నీళ్ళు పట్టుకోవటం మొదలైనవి దుర్గమ్మకు మాత్రం యిలాంటి కట్టుబాట్లేమీ లేవు. ఆమె ఎప్పుడు వచ్చినా, ఎన్ని నీళ్ళు పట్టినా ఎవ్వరూ యిదేమిటని అడగటానికి వీల్లేదు. ఆమె వచ్చే సమయానికి కొళాయి కింద బిందె నిండక పోయినా వెంటనే పక్కకు తీసేసి, ఆమెను పట్టుకోనివ్వాలి. అగి తిరుగులేని రూలు చాలా కాలం నుంచి సాగుతోంది మరి !

అంతా విని "సుబ్బారాయుడుగారింకా కౌన్సిలర్‌గానే వున్నరా ?" అని సందేహంగా ప్రశ్నించింది భ్రమరాంబ.

"ఇంకెక్కడి కౌన్సిలరమ్మా ! కౌన్సిలర్ పదవీ పోయింది ఆ తరువాత ఆయనా పోయారు. ఆయన పోయి రెండేళ్ళు కావస్తున్నా ఈ కొళాయి దగ్గర ఈవిడగారి 'అథారిటీ' మాత్రం తగ్గటం లేదు. మాట్లాడితే తప్పు నోరు తెరిస్తే అమ్మశక్తిలా మీద పడిపోతుంది. ఆ మహాతల్లి నోటికి జడిసి ఎవ్వరూ మాట్లాడరు. ఇళ్ళల్లో గతిలేక, తలో బిందెడు మంచినీళ్ళు పట్టుకుందా మని వచ్చిన సంపార్లమే కదా అంతా. ఆవిడ చేస్తున్నది అక్రమమేనని అందరికీ తెలిసినా, వీధిలో అల్లరి పడటం యిష్టంలేక, ఏదో చూసీచూడనట్టు మంచిగా పనిజరుపుకుపోతున్నాం. ఆ మంచితనాన్ని అలుసుగా తీసుకొని ఆవిడ మరీ మితిమీరి పోతోంది...!" అని యింకా ఏదో చెప్పబోతూండగానే దుర్గమ్మ రావటం జరిగింది. అంతటితో ఆవిడ నోరు కట్టుబడిపోయింది.

బిందె ఎత్తుకొని యింటికి వచ్చింది భ్రమరాంబ. ఆమె మనస్సు మనస్సులో లేదు. దుర్గమ్మ పట్ల చెప్పలేనంత అసహ్యం కలిగింది. దుర్గమ్మ ప్రవర్తన అసహజంగాను, అన్యాయంగాను, అక్రమంగాను, అనాగరకంగాను, అమానుషంగానూ కూడా కనిపించింది

ఊరుమ్మడి సొత్తైన వీధి కొళాయిమీద ఒక వ్యక్తి పెత్తనం చెయ్యట మేమిటి ?

లెక్కప్రకారం ఎక్కడో పడవలసిన కొళాయిని తన కూతురికి అందుబాటులో వుండేచోట వేయించటం సుబ్బారాయుడు చేసిన అధికార దుర్వినియోగం. అది మొదటి తప్పుకాగా, లేని అధికారాన్ని స్వయంగా ఆపాదించుకొని కొళాయి మీద దుర్గమ్మ పెత్తనం చలాయించటం రెండో తప్పు తప్పును తప్పుగా గుర్తించి సరిదిద్దటానికి ప్రయత్నించకుండా తలవంచుకుపోవటం ఆ తప్పును ప్రోత్సహిస్తున్నట్టే లెక్క కనుక అది మూడవ తప్పు మొదటి తప్పు సుబ్బారాయుడిది, రెండవ తప్పు దుర్గమ్మదీ అయితే, మూడవ తప్పు ప్రజలది ఈ ప్రజలు గొర్రెలమందవంటివారు. ఎవరికివారు తనకెందుకులెమ్మనుకుంటారు. ధైర్యంచేసి ఒకరు ముందు దారితీస్తే మిగిలిన వాళ్ళంతా 'పాలో'మంటూ వెనక వచ్చేస్తారు. అందుకు సందేహంలేదు కాని, ముందు దారితీసే దెవరు ?

చాలాసేపు తీవ్రంగా ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చింది భ్రమరాంబ

*　　*　　*



**జాతీయ భాషా సమైక్యతా గ్రంథములు**

| | |
|---|---|
| 30 రోజులలో తమిళ భాష | వెల 4-00 |
| 30 రోజులలో హిందీ భాష | వెల 3-50 |
| 30 రోజులలో కన్నడ భాష | వెల 4-00 |
| 30 రోజులలో మలయాళ భాష | వెల 4-50 |
| 30 రోజులలో సంస్కృత భాష | వెల 4-50 |
| 30 రోజులలో ఆంగ్ల భాష | వెల 7-00 |
| 30 రోజులలో ఉర్దూ భాష | వెల 4-50 |
| 30 రోజులలో మరాఠీ భాష | వెల 4-50 |
| 30 రోజులలో బెంగాలీ భాష | వెల 4-50 |
| 30 రోజులలో పంజాబీ భాష | వెల 4-50 |
| 30 రోజులలో గుజరాతీ భాష | వెల 4-50 |
| 30 రోజులలో ఒరియా భాష | వెల 4-50 |

పై కనుబరచిన పుస్తకములన్ని తెలుగు మూలముగా ఇతర భాషలను 30 రోజులలో వ్యాకరణరీతిగా వ్రాయను చదువను మాట్లాడను నేర్పించగలుగు గ్రంథములు.

**BALAJI PUBLICATIONS**
103, BHARATHIROAD
MADRAS-600 014.

# ఆటకట్టు

సాయంత్రం నాలుగు గంటలకి మళ్ళీ ప్రాణం పోసుకుంది వీధి కొళాయి. బిందెలు...మనుషులు . వరసలు... యథావిధిగా కార్యక్రమం సాగిపోతోంది.

వరసలో వంతు ప్రకారం భ్రమరాంబ కొళాయి కింద బిందె పెట్టింది. మరుక్షణంలోనే ఖాళీ బిందె పట్టుకొని దుర్గమ్మ ప్రత్యక్షమయింది. ఇంకేముంది... అధికారికి దారి యిస్తున్న సామాన్య ఉద్యోగుల్లా వరసలో వున్నవాళ్ళంతా అలవాటు ప్రకారం పక్కకు తప్పుకోవటమేవిటి, దుర్గమ్మ ముందుకు చొచ్చుకు రావటమేవిటి... అతి సహజంగా జరిగిపోయినయ్. విశేషం ఏవిటంటే భ్రమరాంబ పక్కకు తప్పుకోలేదు. ఆమె బిందె కొళాయి కిందే వుంది.

కొద్ది క్షణాలు భ్రమరాంబ బిందె తీస్తుందేమోనని ఎదురుచూశారందరూ ఆమె తియ్యక పోవటంతో ఆశ్చర్యపోయారు ఏం జరుగుతుందోనని కంగారుపడ్డారు. కొత్తకదా అని "తప్పుకోండి దుర్గమ్మగారు పట్టుకుంటారు" అని ఒకావిడ నెమ్మదిగా హెచ్చరించిందికూడాను తప్పుకుంటుందనే ఆమె ఆశించింది కాని భ్రమరాంబ తప్పుకోలేదు.

ఖాళీ బిందె కొళాయి కింద పెట్టటమే అలవాటుగా గల దుర్గమ్మ, పాపం బిందె చేతిలో వుంచుకొని అంతసేపు నిలబడింది. ఇంతవరకు ఆశ్చర్యంగానే చూసింది. ఇంక సహనం సన్నగిల్లిపోయింది. కోపం కట్టలు తెంచుకుంది. కళ్ళు ఎర్రబడి, ముఖం జేవురించి వికృతంగా తయారయింది. పట్టలేని ఆవేశంతో నిలువెల్లా వూగిపోయింది తనకు జరిగింది భరింపరాని అవమానంగా భావించింది. ఇంతకాలం ఎదురులేని మహారాణిలా అధికారం చలాయించిన తనకు, యిందరి సమక్షంలో అవమానం జరగటం తల తీసేసినట్టే అనిపించింది అలనాడు మయసభలో పరాభవింపబడిన అభిమాన ధనుడైన సుయోధన సార్వభౌముని కన్న ఎక్కువగా బాధపడిపోయింది దుర్గమ్మ.

"తియ్యి!" అంది నిలువెల్లా కంపించిపోతూ రౌద్రంగా దుర్గమ్మ

"ఏవిటి ?" కొళాయిమీద చెయ్యివేసి నుంచున్న భ్రమరాంబ తాపీగా అడిగింది.

"బిందె"

"ఎందుకు తియ్యాలి ?"

"నేను పట్టుకోవాలి."

"నేను పట్టుకో వద్దా ?"

"ముందు నేనా ? లేక నువ్వా ?"

"వరసలో ఎవరు ముందుంటే వాళ్ళు"

"నేనూ వరసలో నుంచోవాలా ?"

"నీళ్ళు కావాలిస్తే నుంచోవాలి అందరూ నుంచోవటంలా ?"

"నేనెవరో తెలిసే మాటాడుతున్నావా ?"




MCA-PDP-62-Tel

## పై వారమే
## కొత్త సీరియల్ ప్రారంభం!
# ప్రాక్టీసు పెట్టి చూడు..
రాగతి పండరి వ్యంగ్యచిత్రాలతో
శ్రీరంగం హాస్య రచన

"నువ్వెవరివో తెలుసుకోవాల్సిన అవసరం నాకేమిటి ?"

"పోనీ ఈ కొళాయి ఎవరు వేయించారో తెలుసా ?"

"మునిసిపాలిటీవాళ్ళు"

"ఇక్కడ వేయించింది మా నాన్న"

"వేయించింది మీ నాన్నే అయినా యిది మీ బాబు సొత్తు కాదు ఆయన బాబు సొత్తు అంతకన్న కాదు ప్రజాధనం వెచ్చించి ప్రజల సౌకర్యం కోసం మునిసిపాలిటీవారు దీన్ని వేయించారిక్కడ. దీనిమీద నువ్వు పెత్తనం చెయ్యటమేమిటి ? ఎవరైనా వింటే నవ్విపోతారు !"

"కావాలనే యిక్కడ వేయించుకున్నాం మేము."

"అంత కావాలనుకున్న దానివి నీ దొడ్డిలోనే వేయించుకోకపోయావా ? అబ్బే అందుకు మనసొప్పదు. పెట్టెలో డబ్బు ఖర్చు కాకూడదు. ప్రజల సొత్తు మాత్రం స్వంతం కావాలి !"

"ఎంత కాలంగానో జరుగుతూన్న దిది ఇప్పుడు నువ్వొచ్చి కాదనేస్తే కుదురుతుందా ?"

"కుదరకేం చేస్తుంది ? ఎంతకాలంగా జరుగుతున్నా అన్యాయం అన్యాయం కాకపోతుందా? అక్రమం అక్రమం కాకపోతుందా ? ఇలాంటి అక్రమాలు ఎల్లకాలం సాగవ్ !"

దుర్గమ్మ కింక వాదించే శక్తి లేకపోయింది. శిఖరాగ్రంనుంచి అఖాతంలోకి జారిపోతున్నట్టని పించింది ఒకసారి పాత సభ్యులందరివంకా అసహాయంగా చూసింది. కాని వాళ్ళెవ్వరూ జాలిదలచలేదు. వత్తాసు పలకలేదు భ్రమరాంబ వాదన వాళ్ళందరికీ ఎంతో సమంజసంగా కనిపించింది ఇంతకాలంగా తాము చెయ్యలేని పని ఈ రోజు ఆమె ధైర్యంగా చేసినందుకు మనసులోనే ఆమె నభినందించారు. మెచ్చుకోలుగా చూశారు మొదట ఆశ్చర్యపోయినా, తరవాత ఆనందంగా వుంది వాళ్ళకి.

ఇలా లాభం లేదనుకుంది దుర్గమ్మ, తొలిసారిగా ఖాళీ బిందె కింద పెట్టింది చీర ఎగదోపి బిగించి కట్టింది. ఇంక దౌర్జన్యమే శరణ్యం అనుకుంది.

"ఎవత్తివే నువ్వు లా పాయింట్లు తీస్తున్నావ్ ? ఇక్కడికి కొత్తగా వచ్చినట్లున్నావు నా తడాఖా తెలీదు నీకు జాగ్రత్త – ఏమనుకుంటున్నావో !" ఒక అడుగు ముందుకువేసి అరుస్తున్నంత గట్టిగా అంది దుర్గమ్మ

భ్రమరాంబ బెదరలేదు. అక్కణ్ణించి కదలనూలేదు.

పాతికేళ్ళ పడుచుదనంలో వున్న భ్రమరాంబ, ఎత్తుగా తగుమాత్రం కండరపుష్టితో అందంగా ఆకర్షణీయంగానేగాక ఆరోగ్యంగానూ చలాకీగానూ వుంది. కలబడితే దుర్గమ్మను తిప్పి తిప్పి కొట్టగలదు అయితే ఆమె కలాంటి వుద్దేశ్యం లేదు. అంతవరకు రానివ్వటం ఆమె కిష్టంలేదు. అందుకనే నిలుచున్న చోటునుంచి కదల్లేదు.

"అనవసరంగా నోరు పారేసుకోకు మర్యాదగా మాట్లాడు. చేతకాకపోతే నేర్చుకో. అదీ రాదంటావా–నా అంత అమర్యాదగా మాట్లాట్టం మాత్రం నీకు చేతకాదు. తెలిసిందా ?... మీద మీదకు తోసుకొస్తే జడిసిపోతారనుకున్నావా ? అంత చేతగాని వాళ్ళెవ్వరూ లేరిక్కడ. నీళ్ళు కావాలనుకుంటే మర్యాదగా వెళ్ళి వరసలో నిలబడు అక్కర్లేదంటే తిన్నగా యింటికి వెళ్ళిపో అంతే" అనేసింది స్పష్టంగా, నిర్భయంగా భ్రమరాంబ.

ముఖంమీద మొత్తినట్టయింది దుర్గమ్మకి మరో అడుగు ముందుకువేసే ధైర్యం లేకపోయిందామెకు. అక్కడున్నవారిలో ఒక్కరైనా తనను సమర్థిస్తారన్న నమ్మకం లేకపోయింది. అందుచేత తలవంచక తప్పదనుకుంది.

"సరే నీ బిందె నిండిపోయిందిగా తియ్యి." అంది కాస్త తగ్గి.

"నా బిందె నిండినా నువ్వెలా పట్టుకుంటావ్ ? నా తరవాత నా వెనక వున్న ఆమె పట్టుకుంటుంది నువ్వు వెళ్ళి వరసలో చివర నిలబడు. వంతు వచ్చినప్పుడు పట్టుకుందుగాని."

"అంతా నీ యిష్టప్రకారమే నడుచుకోవాలా ?"

"ఇక్కడ ఎవ్వరి యిష్టానిష్టాలతో ప్రమేయం లేదు ఒక పద్ధతి ప్రకారం అందరూ నడుస్తున్నప్పుడు నువ్వూ అదే విధంగా నడుచుకోవాలి."

"నాకు బోలెడంత పనుంది యింటిదగ్గర!"

"ఇక్కడున్నవారిలో యిళ్ళదగ్గర పనుల్లేనిదెవరికి ? నేనొప్పుకున్నా వాళ్ళొప్పుకుంటారేమో కనుక్కో పోనీ !"

"ఏమ్మా ! నేను ముందు పట్టుకోవటం మీకెవ్వరికీ యిష్టం లేదా ?" అంది ఆశ చావక దుర్గమ్మ

ఎవ్వరూ మాట్లాడలేదు

హతాశురాలైపోయింది దుర్గమ్మ

చిన్నగా నవ్వుతూ బిందె భుజాని కెత్తుకుంది భ్రమరాంబ.

తరవాత ఆమె కొళాయి కింద బిందె పెట్టింది

"నీ ఆటకింక సాగవ్ మర్యాదగా వెళ్ళి వెనక నిలబడు పిచ్చిపిచ్చి వేషాలేస్తే పోలీసు రిపోర్టు యివ్వవలసి వుంటుంది జాగ్రత్త !" అని వార్నింగ్ యిచ్చి వెళ్ళిపోయింది భ్రమరాంబ

చేసేది లేక నీరసంగా వెళ్ళి వరసలో చివర నిలబడింది దుర్గమ్మ

'ఇన్నాళ్ళకి దుర్గమ్మ ఆట కట్టింది !' అని మనసారా ఆనందించారు అక్కడున్నవాళ్ళంతా ●

